
# విష వలయాలు




నెత్తిపైన సీలింగ్ ఫాన్ గిరగిర తిరుగుతూంది. అంతటి గాలి విస్తున్నా, గోపాలరావుకు ఊపిరి ఆడటం లేదు. ఎగురుతున్న ఫైళ్లమీద పేపర్ వెయిట్ పెట్టి, ఫాన్‌కంటె వేగంగా సుడులు తిరుగుతున్న ఆలోచనలను అదుపులో పెట్టలేక, వాటిదారిని వాటిని వదిలేశాడు గోపాలరావు.

"బ్రదర్! ఊఁ! చెయ్యి అందుకో. పరిగెత్తు. మన కంటె ముందు మనుష్యులు పరిగెడుతున్నారు. కాలం పరిగెడుతూంది. ఈ పరుగుపందెంలో ఎవరు ముందుకు సాగితే వాళ్లదే సుఖం, వాళ్లదే శాంతి! వాళ్లదే ఐశ్వర్యం! ఇందులో తప్పు, ఒప్పుల విచక్షణ, నీతి అవినీతుల యోచన లేదు. ఉందా? నువ్వు వెనకపడతావు. నిన్ను తోసుకుని, తొక్కివేసి, నీ నెత్తిమీద అడుగువేసి మరీ పైకి వెడతారు అందరూ! నీ గతి అధోగతే! ఊఁ! చెయ్యి అందుకో!"

తోటి గుమాస్తా రాధాకృష్ణ మాటలు చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి. తనతోబాటు పదేళ్ల క్రితం గుమాస్తా ఉద్యోగంలో చేరిన రాధాకృష్ణ ఈనాడు బంగళాలాంటి ఇల్లు కట్టి, కాలుమీద కాలు వేసుకు కూర్చుని, ఉబుసుపోకకు ఉద్యోగం చేస్తున్నాడు. మరి తను? ఉన్న చోటునుంచి లేవలేక అలాగే కూలబడి, కుమిలికుమిలి ఏడుస్తున్నాడు!

"గోపాలం! కాఫీమాట మరిచిపోయావా ఏమిటి? సీటుకి అతుక్కుపోయి, పగటి కలలు కంటున్నావ్?" శ్రీనివాసరావు పిలుపుతో ఇహలోకంలోకి వచ్చాడు గోపాలరావు.

కాంటీన్‌లో కూర్చుని కాఫీ చప్పరిస్తున్నాడే కాని, మనస్సు మాత్రం ఇంటి చుట్టూరానే తిరుగుతూంది. ఉదయం తను ఆఫీసుకు బయలుదేరేముందు జరిగిన సంఘటనే పదే పదే గుర్తుకు వస్తూంది.

"సుశీల భోజనానికి రాలేదేం?" అన్నాడు పీటమీద కూర్చుంటూ, రోజూ తన పక్కనే తనతోబాటు కూర్చుని భోజనంచేసి, ఆఫీసుకు వెళ్లే చెల్లెలు స్థానం ఖాళీగా ఉండటం చూసి.

"ఒంట్లో కులాసాగా లేదట! ఈరోజు సెలవు పెట్టింది. కాకున్నా ఆ అమ్మాయిని ఇంకా ఇలాగే

ఈ నాడు వయసు వచ్చిన ఆడపిల్లల సమస్యలు అధికమయ్యాయి. చదువు ఉంటే కాని పెళ్ళి కాదు. చదువుకొంటే పెళ్ళి కావడం కష్టం. చదువుకొని ఉద్యోగంలో చేరితే ఆడపిల్లల సమస్యలు మరీ అధికం అవుతాయి. ఊరికే కూర్చుంటే గడవదు. ఇంకా ఎన్నో. పరిష్కార మార్గం కనుపించదు.

---

ఉద్యోగం చేయించటం మనకూ భావ్యంగా లేదు.'' కంచంలో అన్నం వడ్డిస్తున్న లలిత నిష్ఠూరంగా అంది.

ఆశ్చర్యంగా భార్యవేపు చూచాడు. ''నీకూ, మా అమ్మ జాడ్యం పట్టుకుందల్లే ఉంది!'' అన్నాడు నవ్వుతూ.

''ఏం మొగాళ్లో! మీ అంతట మీకేమీ అర్థంకావు. మరొకళ్ళు చెప్పినా అర్థం చేసుకోరు. ముందు భోజనం కానిండి. తరవాత మాట్లాడదాం!'' విసుగ్గా అవతలికి వెళ్లింది లలిత. భోజనం ముగించి లేవగానే, ''ఇవి చూడండి. అప్పుడేనా అర్థమౌతుందేమో!'' అంటూ రెండు కాగితాలు చేతికిచ్చింది లలిత. ఆదుర్దాగా విప్పాడు గోపాలరావు.

''సుశీలా!

నా దస్తూరీనిబట్టి నే నెవరినో [illegible] గలవు. ఇప్పటికి నాలుగు జాబులు [illegible]. [illegible] అలా కాంటీన్‌లో కూర్చుని, కసిగా ముక్కలుగా చింపేశావు! నేను గమనిస్తూనే ఉన్నాను. ఎందుకు నామీద అంత కోపం నీకు? ఈ దాసుడేం తప్పులు చేశాడు? నీ చిరునవ్వుకోసం, నీ కడగంటి చూపుకోసం పాకులాడుతున్న నన్ను నువ్విలా నిర్లక్ష్యం చెయ్యటం సబబేనా? ఒక్కసారి మనస్సు విప్పి మాట్లాడు.

నీ ప్రేమకోసం ప్రాకులాడే

...........''

కింద సంతకం లేదు!

కళ్లు చింతనిప్పులుగా మారాయి గోపాలరావుకు. ''స్కౌండ్రల్!'' పళ్లు పటపట కొరికాడు.

''అది కూడా చదవండి!''

రెండవ కాగితం విప్పాడు.

''సుశీ!

ఆ జాబు చింపలేదు నువ్వు. పదిలంగా దాచుకున్నావు. అదే పదివేలు! కానీ నాకు మరో అనుమానం కూడా వేస్తోంది. బహుశా మీ పెద్దవాళ్లెవరికో ఆ జాబు చూపి, నన్ను అవమానించాలనే దురూహ నీలో ఉందేమో! అందుకే సంతకం చెయ్యటంలేదు. గజిబిజిగా గిలికి పారేస్తున్నాను అక్షరాలు. అలాటి ఆలోచన ఏదేనా ఉంటే విరమించుకో. వృథాగా అల్లరి పడతావు నువ్వే! అరటి ఆకు, ముల్లు సామెత తెలుసుగా? ఇదంతా మాటవరసకు వ్రాస్తున్నాను. దీన్నిబట్టి నన్నో విలన్‌లా ఊహించుకోకు. టైప్ మిషన్‌మీద నీ సున్నితమైన వేళ్లు అలా టకటక నాట్యం చేస్తూంటే నా కెలా ఉంటుందో తెలుసా? నువ్వు అలా మీటేది టైప్ రైటర్ని కాదనీ, నా హృదయవీణనని అనిపిస్తుంటుంది. నిజంగా అలా నీ చేతివేళ్లు నా గుండెలమీద నాట్యంచేసే సన్నివేశం వస్తుందంటావా? ఏమో? ఈ అభాగ్యుడి కంత అదృష్టమా? నీకోసం ఏ త్యాగం చెయ్యమన్నా చేస్తాను. ఎంతటి సాహసం చెయ్యమన్నా చేస్తాను! నీ చేతి చెంప దెబ్బయినా పువ్వులవానగా భావిస్తాను. ఎప్పుడు ఎక్కడ ఎలా కలుసుకోమంటావో వ్రాయి....చాలు. రెక్కలు గట్టుకు వాలతాను.

నీ......

......................''

పరపర చింపిపారేశాడు. ''సుశీలని ఇలా రమ్మను. ఈ వెధవ ఎవడో గుర్తు చూపించమను, చాలు.'' కోపంతో వణికిపోతూ గబగబా సుశీల గదివేపు వడబోయాడు.

''ఆగండి! మీతో చెప్పి రాద్ధాంతం చెయ్యనని మాటిచ్చాను కనకనే నా కీ జాబులు చూపింది సుశీల! తప్పు మనదగ్గిర పెట్టుకుని ఎవరినో దండించ బూనుకోవడం మన తెలివి తక్కువ! ఆ వెధవ ఎవడో కనుక్కొని మీరు నాలుగు తగిలించినంత మాత్రాన, మరో వెధవకి ఇలాటి దుర్బుద్ధి పుట్టదని నమ్మక మేమిటి? వృథాగా మనము, మన సుశీల అల్లరిపడటం మినహా మరేమన్నా లాభం ఉందేమో ఆలోచించండి!''

అడ్డువచ్చి, ఓ విధమైన బోధలా చెప్పింది లలిత.

''లలిత చెప్పిందానిలో అబద్ధ మేముంది?'' అంది మనస్సు.

''హూఁ!'' నిట్టూర్పు విడిచి, ముందుకు నడిచాడు. ఓరగా వేసి ఉన్న తలుపు తోసి లోపలికి తొంగి చూచాడు. గోడ కానుకుని చాపమీద కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తూంది సుశీల. జుట్టు రేగి, ఏడ్చినట్లు స్పష్టం చేస్తున్న, ఉబ్బిపోయిన కళ్లతో తనవేపు చూచింది.

''ఏమమ్మా, సుశీ! ఒంట్లో కులాసాగా లేదట?'' అన్నాడు బలవంతంగా తెచ్చిపెట్టుకుంటున్న నవ్వుతో.

''అవునన్నయ్యా! అందుకే ఆఫీసుకు సెలవు పెట్టాను.'' తడబడుతూ లేచి నిలుచుంది సుశీల.

''సరేలే!'' ఇక ఆ అమ్మాయి ముఖం చూడలేక బయటపడ్డాడు. ఒకొక్క అడుగూ ఆఫీసువేపు పడుతూంది. ఒకొక్కరుగా తన ఇంట్లో మనుష్యులు కళ్లకు కనిపిస్తున్నారు.

మంచంలో పడి చావు బ్రతుకుల అంచులమీద సాము చేస్తున్న తల్లి, పనిమనిషైనా లేకుండా, ఇంటెడు చాకిరీ చేసుకుంటూ, అస్థిపంజరంలా మారిన భార్య, తోటి ఆడపిల్లలంతా పెళ్లిళ్లయి కాపురాలు చేసుకుంటూంటే, ఉసూరుమంటూ, ఉద్యోగం చేస్తున్న చెల్లెలు, తనమీదే అన్ని ఆశలూ పెట్టుకుని కాలేజీలో అడుగు పెట్టిన తమ్ముడు, జీవితం అంటే ఏమిటో, అదెంత నరకసదృశమో అర్థంకాని తన ఇద్దరు పిల్లలు!

అవును, తన కిద్దరే బిడ్డలు. ఇంకా నయం. త్వరగా మేల్కొని తను ఆపరేషన్ చేయించుకున్నాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే? తను సృష్టించే మూలిక పుల్లల సంతానాన్ని మోయలేక భూమాత ఇంకెంతగా ఏడ్చేదో? తన ఆలోచనకు తనే నవ్వుకున్నాడు గోపాలరావు.

''ఏమిటి, గోపాలం! నువ్విలా రోజు రోజుకూ నీరసించిపోతున్నావ్?'' ఆప్యాయంగా భుజంమీద చెయ్య వేసి అడుగుతున్న ప్రాణ స్నేహితుడు వెంకటేశం మాటలతో, తిరిగి చూచాడు గోపాలరావు. ఖాళీ గ్లాసు చేతిలోనే ఉంది. కాంటీన్‌లోని తన మిత్రులంతా దాదాపు వెళ్లిపోయారు.

''ఏమని చెప్పను,వెంకటేశం? ఎన్నని చెప్పుకోను?'' తల చేతుల్లో పట్టుకున్నాడు గోపాలరావు. ఇలా దిగజారిన పరిస్థితుల్లో తనే ఆడది అయి ఉంటే, భోరున ఏడ్చి, ఒక్కసారిగా హృదయభారాన్ని దించుకొని ఉండేవాడు. ఖర్మ! తను మగవాడై పుట్టాడు, ఆడదై పుట్టేకన్నా, అడవిలో మానై పుట్టడం మేలని ఒకనాటి సామెత, ఈనాడు అక్షరాలా అతిశయోక్తిగా మారింది. మగవాడుగా, అందునా, మధ్య తరగతి కుటుంబంలో, బాధ్యతాయుతుడైన మగవాడుగా పుట్టడం అంత దురదృష్టం మరొకటి లేదేమో?

''నాకు తెలుసు, బ్రదర్, నీ బాధ! ఇలా నీలో నువ్వు కుంగి కృశించి సాధించే దేమిటో చెప్పు, గోపాలం! నీ చెల్లాయికి పెళ్లి చెయ్యాలి. అప్పు ఉంది. ఇలాటి పరిస్థితుల్లో ఇంకా నువ్వెందుకిలా 'నీతి నీతి' అంటూ మడిగట్టుకు కూర్చున్నావో నా కర్థంకావటం లేదు.''

వెంకటేశం వేపు చూచాడు గోపాలరావు. తత్త్వబోధ చేస్తున్న భగవంతుడులా మొహం పెట్టి [illegible]చున్నాడు.

''మేంచూడు. నీలానే ఆదర్శాలంటూ తెగ నీలిగాం. తీరా బతుకులో ఎదుర్కోవలసిన వాస్తవిక పరిస్థితుల్ని చూచాక, ఆ ఆదర్శాల కొక్క నమస్కారం పెట్టి, అందరూ ఏ దారిన వెళుతున్నారో, ఆ [illegible] తొక్కాం. నా మాట విను. ఆ నాయుడి రికార్డు కాస్త వాడి కనుకూలంగా వ్రాసి పెట్టు...చాలు! వేలు దిమ్మరిస్తాడు. నీ దరిద్రం తీరుతుంది. ఇదేం ఖూనీచెయ్యటం కాదు. దొంగతనం అంతకంటే కాదు. దొరతనం. ఫక్తు దొరతనం! నౌకరు మొదలు నాయకుల వరకూ సాగుతున్నదే ఈ తంతు. నువ్వొక్కడివీ మానేసినంతమాత్రాన సమాజం అంతా మారదు. నువ్వే నాశనమౌతావు. నీ తాత మరొకడు ఆ డబ్బు ఎగరేసుకుపోతాడు. నువ్వే నాశనమవుతావు. ఊఁ అను! సాయంత్రం ఆఫీసు వదలగానే, ఆ నాయుడు గార్ని నీకు పరిచయం చేస్తాను!''

గోపాలరావు ఊ అనలేదు కానీ ఊహాలోకంలోకి ఎగిరిపోయాడు. ఒక చెడుపని చెయ్యటానికి పరిస్థితులూ, పరిసర వ్యక్తులూ కూడా ఎంతగా ప్రోత్సహిస్తారు! అదే ఓ మంచిపనికి వీరెవరూ అనుకూలించరెందుచేతో.

ఆరేళ్ల క్రితం కాబోలు...ఓరోజు సాయంత్రం ఆఫీసు వదిలాక, అంతా చల్లగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. హఠాత్తుగా ఓ సంఘటన జరిగింది. ఎవరో పహిల్వాన్‌ల లాటి ఇద్దరు రౌడీలు ఓ యువతిని బరబరా లాక్కు వెళుతున్నారు. ''బాబూ! నన్ను వదిలించండి. నేను వీళ్లకేమీ కాను. నన్ను రక్షించండి అన్న

## పవని నిర్మల ప్రభావతి

య్యలూ!'' ఆ యువతి పెద్దగా ఏడుస్తూంది. వీధిలో అంతా తమాషా చూస్తున్నట్లే చూస్తున్నారు. ఎవ్వరూ కల్పించుకోలేదు.

''మనం ఆరుగురం ఉన్నాం. వాళ్లిద్దరు. ఆ గొడవేమిటో కనుక్కుందాం పదండి'' అన్నాడు గోపాలరావు ఉద్రేకంగా.

''అబ్బాయి, గోపాలం! ఇదేం సినిమా కాదు. నాటకం కాదు, హీరో చిటికెన వేలు తగలగానే, తుండు లాంటి విలన్ తుంగచాపలా దొర్లటానికి! ఇది జీవితం భాయ్! వాళ్లిద్దరయినా, వస్తాదుల్లా ఉన్నారు. మనల్ని ఆరుగుర్నీ మడతపెట్టి మరీ బాదుతారు'' అన్నాడు శ్రీనివాసరావు.

''అలా అని ఓ అబలకి అన్యాయం జరుగుతూంటే చూస్తూ ఊరుకుందామా?'' గోపాలరావు ఇంకా అటువేపే చూస్తున్నాడు బాధగా.

''బ్రదర్! రోజూ ఇలాటి అబల లెందరో ఎక్కడో ఓచోట అన్యాయం అవుతూనే ఉన్నారు. వాళ్లందర్ని

# విష వలయాలు

నువ్వు రక్షించగలవా? ఇవన్నీ పుస్తకాలలో చదివే మాటలు. అసలావిడ వాళ్ల మరదలో, ఉంపుడుగత్తో అయి ఉంటుంది. కాస్త మాటాల్లో తేడా వచ్చి ఉంటుందంతే. వీధిలో అందరూ ఆ వినోదాన్ని చూచి ఆనందిస్తూండగా, మనం ఏదో ఘనకార్యం చెయ్యబోయి, చావు దెబ్బలుతిని,మరో వినోదాన్ని కల్పించటమెందుకు? నువ్వొక్కడివీ వెళ్లి ఒళ్లు హూనం చేయించుకుంటానంటే మా అభ్యంతరమేమీ లేదు.ఎందుకొచ్చిన గొడవ? హాయిగా ఇంటి దగ్గిర మనకోసం మన గృహిణులెదురు చూస్తూ ఉంటారు. చల్లగా, వాళ్లు అందించే చిరునవ్వులూ, కాఫీలూ ఊహించుకుంటూ పదండి ముందుకు పదండి తోసుకు!''

రాధాకృష్ణ మాటం కందరూ విరగబడి నవ్వారు.

వాళ్లతోబాటు తనూ రాక తప్పిందికాదు. ఆనాడు ఓ ఘోరం కళ్లముందు జరుగుతూంటే, నివారించడానికి, కనీసం అదేమిటో తెలుసుకోటానికి కూడా నిరాకరించిన వీళ్లంతా ఈనాడు అవినీతి మార్గంలో సాగమని తన నెందు కింతగా ప్రోత్సహిస్తున్నారు? చెడులో ఉన్న ఆకర్షణ ఇది కాబోలు.

''ఏమిటంత ఆలోచన,గోపాలం? అతిగా ఆలోచిస్తే మన ప్రతి కదలికా తప్పుగానే తోస్తుంది, బ్రదర్! నువ్వింక శ్వాస కూడా తీసుకోలేవు. ఊఁ అను. లేదా ఈ మౌనమే అంగీకార మనుకోమంటావా?''

వెంకటేశం, భుజాలు పట్టుకు కుదుపుతున్నాడు.

నిజమే. ఎంతకాలం ఆలోచిస్తాడిలా తను? ఎప్పటికి పరిష్కారం దొరుకుతుంది?

''నీ ఇష్టం!''

''అబ్బ! ఆ ఒక్క చిలక పలుకూ పలకటానికి ఎంతసేపు నన్ను హైరాన పెట్టావురా తండ్రీ! తిన్నగా ఆ మూడు ముత్యాలూ బైటపెట్టావ్! ఇక చాలు. ఇక చూసుకో. నీ చక్రం తిరిగిందనుకో!''

వెంకటేశం వెళ్లిపోయాడు.

వెర్రివాడిలా చూస్తూ ఉండిపోయాడు గోపాలరావు. సాయంత్రం అయిదున్నర ఎలా అయిందో, తన ఫైల్లో ఎన్ని తప్పులు వ్రాశాడో తనకే తెలియదు.

ఒకొక్క అడుగూ భారంగా వేస్తున్నాడు. ఆ అడుగు తనను అధఃపాతాళానికి తొక్కుతున్నట్లు, తను ఎక్కడో ఏ అగాధాల్లోకో కుంగిపోతున్నట్లుగా ఉంది. ఉద్యోగంలో చేరి పదేళ్లు కావస్తూంది. ఏనాడూ నీతి బాహ్యమయిన పని చెయ్యలేదు. తనతోబాటు ఉద్యోగాల్లో చేరినవాళ్లంతా రెండుచేతులా ఆర్జిస్తూంటే వారిని చూచి తను వెక్కిరించేవాడు. నవ్వుకునేవాడు. ''ఎందుకీ అవినీతి బ్రతుకు? చక్కగా రాజాలా, నాలా నీతిగా బ్రతకలేరూ? ఎందుకీ దొంగ సంపాదనలూ?'' అనేవాడు బాగా చనువున్నవాళ్లతో.

''నీకూ మాలాటి పరిస్థితులే వస్తే, అప్పుడర్థం అవుతుంది, గోపాలం! మాకూ నీలానే కడుపునిండా ఆదర్శాలు ఉన్నాయి. అవన్నీ సమాధి చేశాం. ఎందుకో నీ కిప్పుడు చెప్పినా అర్థం కాదులే!'' అనేవారు వాళ్ళు బాధగా.

నిజమే. ఈనాడు తన కర్థం అవుతూంది? తన ఆదర్శాలన్నీ ఏమయ్యాయి? హుఁ! ఇంకేమౌతాయి! జీవితమూ, పరిస్థితులూ అనే ఈ అగ్నుల ముందు ఆహుతి అయిపోయాయి. ఒకొక్క సంఘటనగా, వద్దన్నా గత స్మృతులు నీడల్లా వెంబడిస్తున్నాయి. సరిగ్గా పది సంవత్సరాల క్రితం....ఆదర్శాల ఆకాశ హర్మ్యాలు నిర్మించుకుని అందులోనే కమ్మని కలలు గంటూ కాలం వెళ్లబుచ్చే యువకుడు గోపాలరావు. ఉద్యోగంలో చేరిన హుషారుతో, యౌవనంలోని చలాకీతనంతో, ఏ అనుభవాలూ తెలియని నిర్మలమైన అంతరంగానికి మారురూపుగా ఉండేవాడు గోపాలరావు.

''అమ్మా! నువ్వు లక్ష చెప్పు. నేను కట్నం తీసుకోను....తీసుకోను...తీసుకోను!'' తల్లితో ఖండితంగా తన మొదటి ఆదర్శాన్ని వెల్లడించాడు గోపాలరావు.

''అన్నయ్యా! నిన్ను నేను అభినందిస్తున్నానురా! వరకట్న పిశాచి దేశాన్నంతా ఊపివేస్తున్న ఈ రోజుల్లో




పెద్దలకు మాత్రమే!!

దాంపత్య జీవితంలోని బలహీనత గూర్చి మీరు చింతపడవద్దు

జీవన స్పెషల్

రుచియైన ఆయుర్వేద టానిక్, ఉత్తమ గుణములు కలది. కోల్పోయిన శక్తిని చేకూర్చి మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం ''జీవన స్పెషల్'' సేవించిన, యవ్వనవతులుగా ఉందురు.

**ఎక్కువ ఫలితానికి:**

పాలు వాడటం మంచిది—కావలసినంత దేహవ్యాయామం చేయవలెను—మ్రగుడ్లు వాడరాదు.

**ముఖ్య గమనిక:** జీవనస్పెషల్ మీదేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది కావున మూడు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట చాలా అవసరం లేనియెడల లావై పొదురు లేక దాంపత్య వాంఛ అధిక మగును **ఆరోగ్యం, బలంచేకూరిన వెంటనే మానివేయవలెను.** 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును ధర రూ. 10/—ప్యాకింగు, పోస్టేజి అదనం.

మేము క్రొత్తగా ప్రవేశపెట్టినది - "అమృతలేపనం"

''జీవన స్పెషల్''కు తోడు విక్కిలి నటవైనది. 25 మి. లీ. సీసా 1కి రు 10/—లు నికరం. ఉచిత లిటరేచరకు వ్రాయండి సగం విలువ అడ్వాన్సుగా ఆర్డరతో పంపవలెను మిగిలినది వి. పి. పి మీద చెల్లించవలెను ఆర్డర్లు దిగువ అడ్రసుకు పంపవలెను

ఉత్తరములన్నియు ఇంగ్లీషులోనే వ్రాయవలెను.

**Manager, Jeevamritham Oushada Sala,**
CALICUT-1, (S. INDIA)
Chief Physician: Dr. K N. RAMDAS. Phone 3607 & 2419

**షరా:** ఆంధ్రప్రదేశ్ మధ్యప్రదేశ్. ఒరిస్సాలలో ముఖ్యమైన అన్ని టౌన్లలో స్టాకిస్టులు కావలెను వగైరా నిబంధనలకు వ్రాయండి

నువ్విలాటి నిర్ణయం చేసుకున్నందుకూ, నువ్వు నా అన్నయ్యవయినందుకూ, నేను గర్విస్తున్నానురా!" ఉపన్యాస ధోరణిలో అంది పదిహేడేళ్ళ సుశీల, కాలేజీకి వెళ్ళటానికి సిద్ధమౌతూ.

ఇద్దరి మాటలూ వింటున్న మహాలక్ష్మమ్మ నిప్పులు కురిపించింది.

"నువ్వు కట్నం తీసుకోవు, బాగానే ఉంది! ఎదిగి వచ్చిన ఆడపిల్లకు పెళ్ళి కూడా చెయ్యవుట్రా? రేపు దానికి కట్నం ఇవ్వంది ఎవడు పెళ్ళాడుతాడు?"

"అమ్మా! నేనుకూడా అన్నయ్యలానే కట్నం దమ్మిడీ పుచ్చుకోని ఆదర్శ యువకుణ్ణే పెళ్ళాడతాను. లేదా, హాయిగా చదువుకుని, చక్కగా ఉద్యోగం చేస్తాను!" అంది సుశీల.

"హయ్యో! హయ్యో! ఎంత బరితెగించారే? నన్ను వదిలి మీ దారి మీరు చూసుకున్నారు. ఈ మొండి పీనుగలతో నేను వేగలేక చస్తున్నానురా దేవుడా!" చనిపోయిన భర్త ఫోటోవేపు చూస్తూ వాపోయింది మహాలక్ష్మమ్మ.

"అమ్మది అంతా చాదస్తమే, సుశీ! కాలం మారుతూంది. మనుషులు మారుతున్నారు. మనమూ మన ఆదర్శాలెందుకు నిలుపుకోకూడదు? ఇలా ఎవరికి వారు, పెద్దవాళ్ళకు భయపడో, మరే ఇతర కారణాలవల్లో, గుడ్డిగా మూఢాచారాలు అనుకరిస్తూపోతే, ఇక మన సమాజం ఎప్పటికి బాగుపడేట్లు? నాలా ఏ యువకుడికా యువకుడు 'కట్నం చచ్చినా పుచ్చుకోను!' అని నిర్ణయం చేసుకుంటే, ఈ వరకట్నాల సమస్య నాలుగేళ్ళలో మారిపోదూ?" అన్నాడు గోపాలరావు.

"నిజమేరా, అన్నయ్యా! నువ్వు చెప్పిందంతా నిజం. అమ్మదేమిటిలే? నాలుగునాళ్ళు ఏడ్చి తనే ఊరుకుంటుంది. నిన్ను నేను సమర్థిస్తాను. నన్ను నువ్వు సపోర్టుచెయ్యి. చాలు!" అంది సుశీల.

ఆ నిమిషంలో ఇద్దరి కిద్దరూ ఒకేరకమైన ఊహల బాటల్లో నిరాటంకంగా సాగిపోయారు. ఆ రోజుల్లో గోపాలరావుకు ఏ నాయకుల ఉపన్యాసాలన్నా, ఏ ఆదర్శవాది హితబోధలన్నా అమృతప్రాయంగా ఉండేవి.

ఒకనాడు ఎవరో ప్రజాసేవకుడు, వేదిక ఎక్కి బిగ్గరగా ఉపన్యసిస్తున్నాడు. చిత్తరువులా కూర్చుని, చెవులప్పగించి విన్నాడు గోపాలరావు.

"...ఎటుచూచినా అవినీతి...లంచగొండితనం... ఛీ, ఛీ. నైతిక పతనం! అబ్బా! నా గుండెలు పగిలిపోతున్నాయి! సోదర సోదరీమణులారా! అవినీతికి పాల్పడకండి! లంచగొండితనం అలవరచుకోకండి. మిమ్మల్ని మీరు మోసగించుకోకండి."

అందరూ చప్పట్లు కొట్టడం ఆపినా, గోపాలరావు తన చేతులు చరచటం ఆపలేకపోయాడు. అవును. అతగాడెంత చక్కగా చెప్పాడు! నిజంగా అలాటి ఆదర్శాలు అందరూ ఆచరించగలిగితే దేశవ్యాప్తంగా ఉన్న ఈ అవినీతిని క్షణంలో రూపుమాపవచ్చు.

మూడేళ్ళు గిర్రున తిరిగాయి. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సుశీల బి. ఎ. పాసైంది. మహాలక్ష్మమ్మ రోజు రోజుకు నీరసించి, బొత్తిగా తిరగలేకపోతూంది. ఆవిడకు మందులు, పుష్టికరమైన ఆహారము వాడాలని డాక్టరు సలహా ఇచ్చాడు. ఫోర్తుఫారం పెయిలయిన తమ్ముడికి స్కూలు జీతం, పుస్తకాలు, డ్రెస్సులు కొనాలి. అప్పుడప్పుడు, పుట్టింటికి వచ్చి వెళ్ళే ఇద్దరక్కయ్యలకు, బావగార్లకు, వారి పిల్లలకూ జరపవలసిన మర్యాదలతోబాటు సంసారం జరగాలి. అప్పు మూడువేలు దాటింది. తీర్చే దారి కనిపించటం లేదు.

గోపాలరావు ఆదర్శాల మత్తులోకంమరిచి విడిపించుకుని-కాస్త కళ్ళు తెరిచి చూచేసరికి ఇదీ పరిస్థితి.

"అన్నయ్యా! నేను ఉద్యోగానికి దరఖాస్తు పంపించేశాను. టైపిస్టుగా చేరతాను. ఇద్దరం ఉద్యోగాలు చేస్తే, వెధవ అప్పు ఎంతలో తీరుస్తాంలే, అన్నయ్యా?" ఆలోచిస్తున్న గోపాలరావుకు ధైర్యం చెప్పింది సుశీల.

"సిగ్గులేక ఆడపిల్లచేత ఉద్యోగం చేయించి, ఆ డబ్బుతో అప్పు పూడ్చాలనుకుంటున్నావుట్రా, గోపాలం? కట్నం తీసుకోవడం నామోషీ అయినప్పుడు, వయస్సు వచ్చిన చెల్లెల్ని పదిమందిలోకి పంపడం చిన్నతనం కాదూ?" మహాలక్ష్మమ్మ మండిపడింది.

"అమ్మ మాటలకేంలే, అన్నయ్యా!" అంది సుశీల ఓదార్పుగా.

"ఎలా అయినా ఏడవండి నాయనా! నాకు తెలీదు!'

మరో ఏడు గిర్రున తిరిగింది.

"ఉత్తప్పుడు అంతా ఎలాగూ మా ముఖాన నూలుబట్టలే పారుస్తున్నారాయె. కనీసం వాడి పెళ్ళికయినా, ఆడబిడ్డ లాంఛనాలూ అవీ ఘనంగా ఇస్తాయని ఆశపడ్డాం. తీరా మావాడు అసలు కట్నాలూ, కానుకలూ, లాంఛనాలూకూడా వద్దంటూండె. ఏదో సామెత చెప్పినట్లు, లేనింటి ఆడబడుచులుగా పుట్టడంకంటే, ఉన్న ఇంటి కుక్కగా పుట్టడం మేలట!" కామేశ్వరి, రాజేశ్వరి వంతులవారీగా విసురుతున్నారు బాణాలు తీరుబడిగా కూర్చుని.

విస్మయంగా అక్కలవేపు చూశాడు గోపాలరావు. తను ఉద్యోగంలో చేరింది లగాయతు వాళ్ళిద్దరి పెట్టుపోతల్లోను తనేం లోపం చేశాడు? వచ్చినప్పుడల్లా పిల్లలకూ, తల్లులకూ, తనస్తోమతుకంటే, ఎక్కువగానే జరుపుతున్నాడు కదా? వీళ్ళిద్దరికీ ఎందుకింత అసంతృప్తి? ఇంకా తమకు కాబోయే మరదల్ని, ఆవిడ తలిదండ్రుల్ని పీల్చి పిప్పిచేసి, లాంఛనాలు గుంజాలనే ఆత్యాశ ఎందుకో?

"ఏ లోపమో లేకుంటే, నిక్షేపంలాటి కుర్రాడు, ఉద్యోగం చేసుకుంటూ, కట్నం వద్దనడమేమిటి? అలాటివాడికి ఏ పిల్లనిచ్చి, దాని గొంతు కోయలేం. ఏదో అప్పో సప్పో తెచ్చి కట్నమిచ్చి, మంచి సంబంధమే చూచుకుంటాం అంటున్నారమ్మా మహాలక్ష్మమ్మకు పిల్లనిచ్చే పెద్ద మనుష్యులు! ఇక నీ కొడుక్కి ఈజన్మకు పెళ్ళికాదు!" పేరిశాస్త్రిగారి వ్యాఖ్యానం.

"నా ఖర్మ నాయనా! ఆడపిల్లల పెళ్ళిళ్ళకంటే, ఎక్కువ బాధ పడవలిసొస్తూంది వీడి పెళ్ళికి. అంతా నా ఖర్మలే నాయనా!" మహాలక్ష్మమ్మ చీదేస్తూంది.

చుట్టూ రోదన. అశాంతి, అసంతృప్తి, అప్పులు. ఇవి చాలవన్నట్లు తనలో లేని ఏదో లోపం ఆరోపించి, తన వ్యక్తిత్వాన్నే శంకిస్తున్న లోకులు. గోపాలరావు ఎటూ చెప్పలేక వీగిపోతున్నాడు.

"బ్రదర్! ఆదర్శాలంటూ ఇలాగే పాకులాడతాం. కానీ ఆలోచించి చూస్తే, మన ఆదర్శాలకు అర్థంలేదు.







అసలు మనకివి ఆచరించే అర్హతే లేదేమోననిపిస్తోంది. అవి మనకే ప్రాణాంతకాలుగా పరిణమిస్తాయి. నా సంగతి చూడు. కట్నం పుచ్చుకోకూడదనుకున్నాను. వధువు తలితండ్రులు, నన్నూ నీలానే శంకిస్తున్నారు. 'ఎంత ఎక్కువ కట్నం అడిగితే అంత చక్కటి సంబంధం' అని తలిచే ఈ రోజుల్లో, కట్నం కోరని మనలాంటివాళ్ళను పిచ్చివాళ్ళ కింద జమ కట్టడంలో ఆశ్చర్యం లేదు. అది అలా వదిలెయ్యి. మా చెల్లాయికి సంబంధం కుదిర్చాం. బి. ఎ. పాసైన వరుడు, నాలుగు వేలు కట్నం. ఇప్పుడా నాలుగు వేలూ అప్పు తేవాలా, వద్దా? వన్‌వే ట్రాఫిక్‌లా అయింది మన బ్రతుకు. కేవలం మనం చేతులు ముడుచుకుని కూర్చున్నంతమాత్రాన, కట్నాల సమస్య అంతమౌతుందనుకోవడం మన భ్రమ. ఇక మనకు మిగిలేదేమిటి? అప్పు! అవునా?'' శ్రీనివాసరావు హితబోధ చేశాడు.

''కాదు..... కాదు. ఆత్మ సంతృప్తి మిగులుతుంది!'' అన్నాడు గోపాలరావు.

గట్టిగా నవ్వాడు శ్రీనివాసరావు. ''పెళ్ళి ఖర్చుతో సహా ఆరువేల అప్పు ఒకవేపు, మరోవేపు మన తలితండ్రులూ, ఇంకా మిగిలి ఉన్న అక్కచెల్లెళ్ళూ, అన్నదమ్ములూ కాక మన భార్యా బిడ్డలూను. ఓహ్! ఆత్మ సంతృప్తి! ఆ తృప్తి మనకు భోజనం పెడుతుందా? అప్పు పూడుస్తుందా?''

# విష వలయాలు

దిక్కు తోచలేదు గోపాలరావుకు.

• • •

''కట్నం నాలుగు వేలు, అక్షరాలా నాలుగు వేల రూపాయల సొమ్ము ముట్టచెప్పాం!'' తళతళ మెరిసే వెండి పళ్ళెంలో నోట్లు, తన కళ్ళముందు ఉంచారు వధువు వేపు పెద్దలు...చేతితో తాకమంటున్నాడు పురోహితుడు. పట్టుబడ్డ పాములా బుసలు కొడుతోంది గోపాలరావు హృదయం. ఇంతమంది పెద్ద మనుషులున్నారు ఈ పెళ్ళి పందిట్లో. ఎవరేనా లేచి ''ఆగండి! కట్నం ఇవ్వటమూ, పుచ్చుకోవటమూ కూడా చట్టరూపేణా నేరం! మేం రిపోర్టు ఇస్తాం!'' అంటూ అనరేం? వీళ్ళకు చట్టం తెలీదా? కనీసం ఇలా రూపంగానైనా తన ఆదర్శాన్ని నిలుపుకోగండేమో!

''నాలుగు వేలూ లెక్క చూచుకోండి కావలిస్తే!'' రోషంగా హెచ్చరించాడు అందులో ఒకాయన, పెళ్ళికొడుకు సందేహిస్తున్నాడనే ఉద్దేశ్యంతో.

ఆదర్శాన్ని చంపుకున్న తనకింకా ఆలోచనేమిటి? చేతితో తాకాడు. నిప్పులాభగ్గుమన్నట్లయ్యింది. అదితన భ్రమేనేమో! వధువు లలితవేపు చూచాడు. డబ్బువేపూ, తనవేపూ, మార్చి మార్చి చూస్తోంది. ''విద్యాచదువూ, సంస్కారం, వ్యక్తిత్వం విలువ ఇంతేనా?'' అనో, లేక ''ఈ డబ్బు విలాలానే మా అన్నయ్య, మా వదిన తలిదండ్రుల్ని పీల్చి సంపాదించుకువచ్చి, ఆ డబ్బుతోనే మిమ్మల్ని కొంటున్నాడు!'' అనే భావనే ఉందో తెలుసుకుందామనుకునే లోపలే లలిత కళ్ళు వాల్చేసింది. నాగవల్లి వేళ హోమంచేస్తూ, అగ్నిలో ఆజ్యం పోస్తూ, తన మొదటి ఆదర్శాన్ని కూడా సమిధగా వేసేశాడు గోపాలరావు. అక్కలిద్దరూ, చెరో అయిదు వందలూ పట్టుకెళ్ళారు ఆడబిడ్డ లాంఛనాల పేరుతో. స్నేహితులకూ, ఊళ్ళో పెద్దలకూ, డిన్నరూ, ఆహూతులకూ, బంధువులకూ బట్టలూ, వధువుకు సొమ్ములకూ కలిపి, మూడువేలూ ఇట్టే ఎగిరిపోయాయి. మిగిలిందేమిటి? అలాగే ఉన్న అప్పు. వ్రతం చెడిందన్న ఆవేదన. గాఢంగా నిట్టూర్చాడు గోపాలరావు. తనకు పెళ్ళయిన ఆరునెలల నించి మహాలక్ష్మమ్మ గోల మరీ ఎక్కువైంది.

''ఒరే గోపాలం! సుశీలకా మూడు ముళ్ళూ పడేయించరా! ఎంత ఉద్యోగం చేసినా ఆడపిల్లనో అయ్య చేతిలో పెడితేనే పరువురా!''

గోపాలరావు విసుక్కున్నాడు. ''నీకెందు కాబాధ? అది హాయిగా ఉద్యోగం చేసుకుంటూంది. నేనెలాగూ మాట నిలుపుకోలేక పోయాను. అదయినా, ఆదర్శ యువకుణ్ణే పెళ్ళాడనీ!'' అన్నాడు పొంగి వస్తున్న కోపాన్ని అణచుకుంటూ.

''మీ ఇద్దరూ చిలకా గోరింకల్లా తిరుగుతూంటే, ఇంట్లో ఆడపిల్ల ఉసూరుమంటూందిరా! అది నీకు క్షేమం కాదురా నాయనా!''

''ఈ ముసలి పీనుగల కిదో రోగం! ఏవేవో ఊహించుకుంటూ ఎదుటివాళ్ళ ప్రాణాలు తోడేస్తారు! వీళ్ళకు వయస్సు పెరిగే కొద్దీ వివేకం తగ్గుతుంది కాబోలు! హాయిగా కృష్ణా! రామా! అనుకోక, అస్తమానం వివాహ చింతనే!'' అసిగాణుక్కుంటూనే, ''సుశీలా! ఇలా రా!'' అంటూ పిలిచాడు.

సుశీల వచ్చింది.

''నేను పెళ్ళి చేసుకున్నాననీ, నీకు పెళ్ళి కాలేదనీ బాధ పడుతూ, అమ్మతో చెప్పుకున్నావా నువ్వు?'' వస్తున్న నవ్వు అణచుకుంటూ అడిగాడు గోపాలరావు.

తల్లివేపు రోషంగా చూచింది సుశీల. ''ఏమమ్మా? ఎప్పుడేనా అలా అన్నానటే నీతో? అమ్మకిదో జాడ్యం, అన్నయ్యా! 'ఉద్యోగం మానెయ్యవే!' అని నన్నూ, 'పెళ్ళి చెయ్యరా!' అని నిన్నూ ప్రాణం తీస్తోంది. అంతే!''

''మీ ఇష్టాలు నాయనా! చెట్లలా పెరిగారేగానీ జ్ఞానం లేదురా!'' అంది చేసేది లేక.

రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. ఇంట్లో మరో ఇద్దరు మెంబర్లు పెరిగారు. పాలడబ్బాలు, మందులూ. తల్లి మంచంలో పడింది. సూర్యం కాలేజీలో చేరాడు. దారిలో ఎదురు రాయి తగిలింది.

''అబ్బా!''కాలి వేలు బాగా దెబ్బతిని రక్తం చిమ్మింది. ఒక్కసారిగా మైకం వదిలినట్లయింది గోపాలరావుకు. ఇల్లుదాటి పది గజాలు వచ్చాడు తను. ఇంతవరకూ పది సంవత్సరాల అనుభవాలూ దృశ్యాలుగా చూస్తూ, ఎలాగో అలవాటయిన తోవ కాబట్టి, ఇదే వీధికి రాగలిగాడు.



